క్లుప్తంగా

ఆధార్ క్యాంప్ పరిశీలన



అల్లూరు: నగర పంచాయతీ పరిధిలోని అల్లూరు–2 సచివాలయంలో ఎస్టీల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆధార్ క్యాంపును కమిషనర్ ఉమామహేశ్వరరావు సోమవారం పరిశీలించారు. 18ఏళ్లలోపు ఉన్న ఎస్టీ పిల్లలకు ప్రత్యేక క్యాంపులో ఆధార్ నమోదు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ఎస్టీలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి వరప్రసాద్ ఉన్నారు.

అపూర్వ సమ్మేళనం



సీతారామపురం : స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని సోమవారం నిర్వహించారు. 1998 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు ఒకరినొకరు కలుసుకుని గత స్మృతులను నెమరువేసుకున్నారు. ఆటపాటలతో సందడిగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సత్కరించారు.27 ఏళ్ల తర్వాత స్నేహితులను కలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉందని పూర్వవిద్యార్థులు తమ మనోభావాలను వ్యక్తం చేశారు.

వెంగమాంబ బ్రహ్మోత్సవాలపై సమీక్ష సమావేశం 30న

దుత్తలూరు: నర్రవాడ వెంగమాంబ పేరంటాలు బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై కావలి ఆర్డీఓ వంశీకృష్ణ అధ్యక్షతన ఈ నెల 30న సమీక్ష సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ వీ ఉషశ్రీ సోమవారం తెలిపారు. జూన్ 15 నుంచి 19వ తేదీ వరకు జరిగే బ్రహ్మోత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహిస్తారని చెప్పారు. మధ్యాహ్నం 3 గంటలకు జరిగే సమావేశానికి అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని ఆమె కోరారు. అలాగే అదేరోజు ఉదయం పది గంటలకు దేవస్థానం ప్రాంగణంలో తాత్కాలిక అంగళ్ల ఏర్పాటుకు బహిరంగ వేలంపాటలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

రేషన్‌ను సక్రమంగా పంపిణీ చేయాలి



ఉదయగిరి: రేషన్ డీలర్లు చౌకదుకాణాల్లో అందుబాటులో ఉండి రేషన్ లబ్ధిదారులకు సరుకులను సక్రమంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ సుభద్ర అన్నారు. సోమవారం ఆమె తన కార్యాలయంలో రేషన్ డీలర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికి రేషన్ పంపిణీని రద్దు చేసిందని తెలిపారు. జూన్ నుంచి చౌకదుకాణాల్లోనే సరుకులు పంపిణీ చేయాలన్నారు. సరుకులకు డీడీలు సకాలంలో చెల్లించాలన్నారు. 15 రోజుల పాటు సరుకులు పంపిణీ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో డీటీ షాజియా పాల్గొన్నారు.

ఆటో ఢీకొని వృద్ధుడికి గాయాలు



గాయపడిన వృద్ధుడ్ని ఆస్పత్రికి తరలిస్తున్న స్థానికులు

ఉదయగిరి: స్థానిక పంచాయతీ బస్టాండ్ వద్ద నిలబడి ఉన్న వృద్ధుడ్ని ఆటో ఢీకొనడంతో గాయాలపాలయ్యాడు. ఈ ఘటన సోమవారం జరిగింది. వివరాలు.. కొండాయపాళెం పంచాయతీ వీరారెడ్డిపల్లెకు చెందిన వీరారెడ్డి పని నిమిత్తం ఉదయగిరి వచ్చాడు. పంచాయతీ బస్టాండ్ వద్ద నిలబడి ఉండగా దుర్గంపల్లెకు చెందిన ఓ ఆటోడ్రైవర్ మద్యంమత్తులో వాహనాన్ని వేగంగా నడుపుతూ వచ్చి ఢీకొన్నాడు. ఈ ఘటనలో వీరారెడ్డికి ఎడమ కాలుకు తీవ్ర గాయమైంది. క్షతగాత్రుడ్ని స్థానికులు ఉదయగిరి వైద్యశాలకు తరలించారు. పోలీసులకు సమాచారం అందించగా ఆటో, ఆటో డ్రైవరును అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని కొన్ని వార్డుల్లో మంగళవారం తాగునీటి సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు మున్సిపల్ కమిషనర్ సీ గంగా ప్రసాద్ సోమవారం తెలిపారు. వాటర్ ప్లాంట్‌ను శుభ్రం చేయడంతో పాటు మోటార్లకు మరమ్మతులు చేపడుతున్న దృష్ట్యా 4,5,6,8,9, 10,11, 13, 15, 16, 17, 18 వార్డుల పరిధిలో తాగునీటి సరఫరాను నిలిపివేస్తున్నామని చెప్పారు. బుధవారం నుంచి యథావిధిగా తాగునీటిని సరఫరా చేస్తామని తెలిపారు.

విత్తనాలు ఇచ్చేదెప్పుడో..వెదజల్లేదెప్పుడో..

- ఏటా మేలోనే పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ
- ఈ ఏడాది ఇప్పటి వరకు వ్యవసాయ శాఖ కార్యాలయాలకు చేరని విత్తనాలు
- వర్షాలు పడుతున్న నేపథ్యంలో రైతుల ఎదురుచూపులు



సోమలరేగడలో రైతులే విత్తనాలు తెచ్చుకుని సాగుచేసిన పచ్చిరొట్టపైరు

దుత్తలూరు: ఏటా భూసారాన్ని పెంచుకునేందుకు ఖరీఫ్ పంట సాగుకు ముందుగా రైతులు పచ్చిరొట్ట పైర్లను సాగుచేస్తుంటారు. ఈ ఏడాది ఇప్పటి వరకు పచ్చిరొట్ట విత్తనాలు వ్యవసాయ కార్యాలయాలకు చేరుకోలేదు. తొలకరి వర్షాలు కురుస్తున్నందున విత్తనాలు అందుబాటులో ఉంటే దుక్కులు దున్నుకుని వెదజల్లేవారు. సేంద్రియ వ్యవసాయంలో భాగమైన పచ్చిరొట్ట విత్తనాల పంపిణీలో జాప్యం జరుగుతుండడంతో రైతులు వాటి కోసం ఎదురుచూస్తున్నారు. ఏటా మే నెలలోనే వ్యవసాయ శాఖ కార్యాలయాలకు సబ్సిడీ పచ్చిరొట్ట విత్తనాలు చేరేవి. మే నెలాఖరు కల్లా విత్తనాలను రైతులకు పంపిణీ చేసేవారు. తొలకరి జల్లులు పడగానే రైతులు దుక్కులు దున్నుకుని విత్తనాలను వెదజల్లేవారు. జూన్ ఆరంభం నుంచే వరి విత్తనాలను పంపిణీ చేస్తుంటారు. ఈ ఏడాది జూన్ వస్తున్నప్పటికీ పచ్చిరొట్ట విత్తనాలే ఇప్పటి వరకు వ్యవసాయ కార్యాలయాలకు చేరలేదు. ఈ ఏడాది ముందస్తుగా వర్షాలు పడుతున్న నేపథ్యంలో రైతులు ముందుగా సాగు చేపట్టేందుకు సన్నద్ధమవుతున్నారు. అయితే పచ్చిరొట్ట విత్తనాలు లేకపోవడంతో రైతులు ఎదురుచూస్తున్నారు. విత్తనాలు ఆలస్యంగా పంపిణీ చేయడం వలన రైతులకు ఎటువంటి ప్రయోజనం ఉండదు. పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగ, జనుము, పిల్లిపెసర్ల పైర్లను పూతదశకు వచ్చేవరకు పెంచి భూమిలో కలియ దున్నుతారు. అలా చేస్తేనే భూమికి అవసరమైన నత్రజని, సేంద్రియ కర్బనం అందుతుంది. విత్తనాలను ఆలస్యంగా పంపిణీ చేయడం వలన వరి నాట్లు వేసే సమయానికి పచ్చిరొట్ట పూత దశకు రాక భూమిలో కలియదున్నినా ఫలితం ఉండదు. ఉదయగిరి వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని దుత్తలూరు మండలంలో 200, ఉదయగిరిలో 400, సీతారామపురంలో 200, వరికుంటపాడులో 250 ఎకరాల్లో రైతులు వరిసాగు చేస్తారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎకరాకు జీలుగలు 10 కిలోలు, పిల్లిపెసర్లు 8 కిలోలు, జనుములు 10 కిలోల చొప్పున ఒక్కో రైతుకు పాసుపుస్తకాల ఆధారంగా ఐదెకరాల వరకు విత్తనాలను సబ్సిడీపై అందజేస్తారు. ఈ లెక్కన సుమారుగా 200 క్వింటాళ్ల జీలుగలు, 300 క్వింటాళ్ల జనుములు, 100 క్వింటాళ్ల పిల్లిపెసర విత్తనాలు అవసరమవుతాయి. పచ్చిరొట్ట విత్తనాల సాగువలన మిత్రపురుగుల సంఖ్య పెరిగి నీటి యాజమాన్యం అవసరం తగ్గుతుంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సకాలంలో పచ్చిరొట్ట విత్తనాలను సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు.

విత్తనాలను వెంటనే పంపిణీ చేయాలి



ఈ ఏడాది వర్షాలు ముందస్తుగా పడుతున్నాయి. ఏటా మేలోనే పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేసేవారు. మే నెలాఖరులో విత్తనాలను వెదజల్లితే వరి సాగు సమయానికి పూతదశకు వచ్చేది. ఈ ఏడాది జూన్ వస్తున్నా ఇప్పటి వరకు విత్తనాలను పంపిణీ చేయలేదు. విత్తనాలను ఎప్పుడు వెదజల్లాలి.. పైరు పెరిగి భూమిలో కలియదున్నేది ఎప్పుడు. వెంటనే విత్తనాలు పంపిణీ చేయాలి.

–చింతనబోయిన రత్తయ్య, రైతు, అయ్యవారిపల్లి, సీతారామపురం మండలం

రెండ్రోజుల్లో అందుబాటులోకి



పచ్చిరొట్ట విత్తనాలకు సంబంధించి ఉన్నతాధికారులకు నివేదికలు పంపాం. రెండ్రోజుల్లో విత్తనాలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. విత్తనాలు రాగానే రైతులకు ఇబ్బంది లేకుండా త్వరగా పంపిణీ చేస్తాం. విత్తనాలు అవసరమైన రైతులు వీఏఏలకు వద్దకు వెళ్లి నమోదు చేసుకోవచ్చు.

–పీ చెన్నారెడ్డి, ఏడీఏ, ఉదయగిరి

కిలో పొగాకు గరిష్ట ధర రూ.280

కలిగిరి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో సోమవారం కిలో పొగాకుకు గరిష్టంగా రూ.280 ధర లభించింది. జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 476 బేళ్లను వేలానికి తీసుకురాగా, 381 బేళ్లను కొనుగోలు చేశారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.280, కనిష్టంగా రూ.200, సరాసరిన రూ.247.32 ధర పలికిందని వేలం నిర్వహణాధికారి టీ ఇషాక్‌స్వర్ణదత్ తెలిపారు.

డీసీపల్లిలో 450 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో సోమవారం వేలానికి 518 బేళ్లు రాగా, 450 బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి జీ రాజశేఖర్ తెలిపారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.280, కనిష్టంగా రూ.200, సగటున రూ.245.75 ధర పలికిందని వివరించారు. వేలంలో 8 కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారని తెలిపారు.

కలిగిరిలో ఓ మోస్తరు వర్షం

కలిగిరి: మండలంలో ఆదివారం రాత్రి, సోమవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో పలు గ్రామాల్లో అంతర్గత రోడ్లు బురదమయమయ్యాయి. మండల కేంద్రమైన కలిగిరిలో కొండాపురం రోడ్డుపై నేరేడు చెట్టు వద్ద వర్షపు నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు పొలాలు పదునెక్కి దుక్కులు దున్నడానికి అనుకూలంగా మారాయి. వర్షాలు తగ్గుముఖం పడితే దుక్కులు దున్నడానికి రైతులు సన్నాహాలు చేస్తున్నారు. కాగా నిన్నమొన్నటి వరకు ఎండలతో అల్లాడిన ప్రజలు వర్షంతో వాతావరణం చల్లబడటంతో కాస్తా ఊరట చెందుతున్నారు.

నేడు యోగాంధ్రపై శిక్షణ

అనుమసముద్రంపేట: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల్లో యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఎంటీల ద్వారా టీఓటీలకు శిక్షణా కార్యక్రమాలను మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కార్యాలయం సోమవారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఉదయం పది గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో మొదటి బ్యాచ్ కింద సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, మండలాధికారులకు శిక్షణ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రెండో బ్యాచ్ కింద వీఓఏలు, సీసీలు, ఏపీఎంలు, ఉపాధి సిబ్బందికి వెలుగు కార్యాలయం, మూడో బ్యాచ్ కింద అంగన్‌వాడీలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లకు మండల విద్యావనరుల కేంద్రంలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. తహసీల్దార్ ఎంపీడీఓ పర్యవేక్షిస్తారని తెలిపారు.

పరామర్శ

ఉదయగిరి రూరల్: పట్టణంలోని దిలావర్‌బాయి వీధికి చెందిన దాదాబాయి అనారోగ్యంతో బాధపడుతుండగా మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖరరెడ్డి సోమవారం పరామర్శించారు. దాదాబాయి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని జాగ్రత్తగా ఉండాలని, అధైర్యపడొద్దని సూచించారు. తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయన్నారు. ఆయన వెంట ఉపసర్పంచ్ ముర్తుజా హుస్సేన్, స్థానికులు మాబాషా,సమద్, తాహేర్, తదితరులు ఉన్నారు.

హనుమాన్ శోభాయాత్ర జయప్రదంపై కృతజ్ఞతలు

ఆత్మకూరురూరల్: ఆత్మకూరులో ఆదివారం నిర్వహించిన హనుమాన్ శోభాయాత్రలో పాల్గొని విజయవంతం చేసి అశేష భక్తజనానికి రాష్ట్ర బీజేపీ నాయకులు సోమవారం కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర బీజేపీ నాయకుడు కుడుముల సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ గత నెల రోజులుగా యాత్రపై విస్తృత ప్రచారం నిర్వహించిన కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు. శోభాయాత్రలో సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించిన, అన్నప్రసాద వితరణ చేసిన శ్రీసాంబశివ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, నిత్యాన్నదాత కంచి పరమేశ్వరరెడ్డి, సహాయసహకారాలు అందించిన తెలుగుభారతి సేవా సమితి సభ్యులకు హనుమాన్ సేవా సమితి తరుపున కృతజ్ఞతలు తెలిపారు.

సర్వేలపై అలసత్వం వహిస్తే చర్యలు

సీతారామపురం: సచివాలయ సిబ్బంది సర్వేలపై అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ భాస్కర్ హెచ్చరించారు. మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో సోమవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. జనన ధ్రువీకరణపత్రాలు లేని చిన్నారులు, యోగాంధ్ర రిజిస్ట్రేషన్, జీఎస్‌డబ్ల్యూ, తదితరాలపై సమీక్షించారు. సర్వేలను పూర్తి చేయకపోతే మెమోలు తప్పవన్నారు. అనంతరం హౌసింగ్ ఏఈ కరిముల్లాతో కలిసి ఎన్టీఆర్ పక్కాగృహాల పురోగతిపై ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్షించారు. అర్హులైన ప్రతిఒక్కరికి పక్కాగృహాలు మంజూరు చేయాలన్నారు. డిప్యూటీ ఎంపీడీఓ భార్గవిరెడ్డి పాల్గొన్నారు.

కాకాణి అరెస్ట్ అప్రజాస్వామికం



జలదంకిలో విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

జలదంకి: వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై కక్ష సాధింపులే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని, ఏ మాత్రం సంబంధం లేని కేసులో కక్ష కట్టి మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు ఇస్కా మదన్‌మోహన్‌రెడ్డి అన్నారు. కాకాణి గోవర్ధన్‌రెడ్డి అరెస్ట్‌ను ఖండిస్తూ మండల వైఎస్సార్‌సీపీ నాయకులు జలదంకిలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సూపర్‌సిక్స్ హామీలను గాలికొదిలేసిన కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించకుండా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, మీడియా, సోషల్ మీడియా వారిపై అక్రమ కేసులు బనాయించి అరెస్ట్‌లతో భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వ అరాచకాలు, వైఫల్యాలను ప్రశ్నిస్తున్న కాకాణిని అరెస్ట్ చేసి గొంతునొక్కడంపై జిల్లా ప్రజలు మండిపడుతున్నారన్నారు. కాకాణి కడిగిన ముత్యంలా బయటకు వస్తారన్నారు. అనంతరం కాకాణి అక్రమ అరెస్ట్‌ను నిరసిస్తూ నినాదాలు చేశారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ మేదరమెట్ల శివలీల, వైస్‌ఎంపీపీ పాలవల్లి మాలకొండారెడ్డి, సొసైటీ మాజీ అధ్యక్షుడు కేతిరెడ్డి రవిరెడ్డి, గుర్రం జగ్గయ్య, వైస్ ఎంపీపీ వట్టికాల బాలయ్య, మండల పబ్లిక్ వింగ్ అధ్యక్షుడు సురె వెంకటశేషారెడ్డి, మాజీ సర్పంచ్ తిప్పారెడ్డి ఇందిరమ్మ, నియోజకవర్గ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు వాకా మాధవరెడ్డి, వలంటీర్ వింగ్ అధ్యక్షుడు కోర్శిపాటి రామిరెడ్డి, నాయకులు బోడిమండ్ల కృష్ణారెడ్డి, డీ రఘురామిరెడ్డి, వంటేరు లక్ష్మీనరసారెడ్డి, వేలమూరి శ్రీధర్‌రెడ్డి, వేలమూరి నరోత్తమరెడి, పులి మాల్యాద్రి, విజయభాస్కర్‌రెడి, దాకా గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కక్ష సాధింపునకే కాకాణి అరెస్ట్

కలిగిరి: కూటమి ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ నాయకులపై కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై అక్రమంగా కేసులు బనాయించి అరెస్ట్ చేశారని జెడ్పీటీసీ సభ్యుడు పాలూరు మాల్యాద్రిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో ఖండించారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమల్లో భాగంగానే వైఎస్సార్‌సీపీలోని ప్రధాన నాయకులను టార్గెట్ చేస్తున్నారన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నేరవేర్చని కూటమి ప్రభుత్వంపై అధికారంలోకి వచ్చిన సంవత్సరంలోపే అన్ని వర్గాల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొందన్నారు. కాకాణి గోవర్ధన్‌రెడ్డి వంటి ప్రజాదరణ ఉన్న నాయకులను అరెస్ట్ చేసి కుటిల రాజకీయాలకు పాల్పడుతున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలు తగినరీతిలో బుద్ధి చెబుతారన్నారు. వైఎస్సార్‌సీపీపై ప్రజల్లో రోజురోజుకి ఆదరణ పెరుగుతోందన్నారు. అక్రమ అరెస్ట్‌లు, హింసాత్మక చర్యలకు పాల్పడే కూటమి ప్రభుత్వ పెద్దలు తగిన మూల్యం చెల్లించుకునే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు.

ఈకేవైసీని త్వరితగతిన చేయించుకోవాలి

ఉదయగిరి: మండల ప్రజలు సచివాలయాల్లో సంప్రదించి హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ కోసం ఈకేవైసీని తప్పనిసరిగా చేయించుకోవాలని ఎంపీడీఓ అప్పాజీ సోమవారం తెలిపారు. మండలంలో ఈకేవైసీ ఎక్కువశాతం పెండింగ్ ఉందన్నారు ఈకేవైసీ చేయించుకోకుంటే భవిష్యత్‌లో ఎలాంటి ధ్రువీకరణపత్రాలు, ,ప్రభుత్వ పథకాలను పొందలేదని చెప్పారు. ఈకేవైసీ ప్రక్రియ ముగియక ముందే చేయించుకోవాలని కోరారు.

రోడ్డును ఆక్రమించారని ఫిర్యాదు

సీతారామపురం : మండలంలోని సింగారెడ్డిపల్లి ఎస్సీ కాలనీలో శ్రీనివాసులు, మునలయ్య అనే వ్యక్తులు రోడ్డును ఆక్రమించి బాత్‌రూములు నిర్మించడంతో సీసీరోడ్డు నిర్మాణం చేపట్టేందుకు అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయని ఆ కాలనీవాసులు తహసీల్దార్ పీవీ కృష్ణారెడ్డి, ఎంపీడీఓ భాస్కర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. అధికారులు స్పందించి రోడ్డును సర్వే చేసి హద్దులు చూపాలని కోరారు. స్పందించిన అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి న్యాయం చేస్తామన్నారు.

ఆధార్ నమోదుకు నిరీక్షణ



సర్వర్ పనిచేయకపోవడంతో ఆధార్ కేంద్రంలో నిరీక్షిస్తున్న ప్రజలు

ఉదయగిరి రూరల్: పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలోని ఆధార్ నమోదు కేంద్రంలో తరచూ సర్వర్ మొరాయిస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి పథకానికి ఆధార్ కార్డు ప్రధానం కావడంతో నమోదు, తప్పొప్పుల సవరణలకు ఆధార్ కేంద్రానికి నిత్యం సుమారు యాభై మందికిపైగా వస్తుంటారు. ఉదయగిరి పరిసర మండలాల్లో ఆధార్ కేంద్రాలు లేకపోవడంతో.. ఉదయగిరి మండలంలో ఆధార్ నమోదు కేంద్రం ఒక్కటే కావడంతో రద్దీ ఎక్కువగా ఉంటోంది. తాజాగా సోమవారం సర్వర్ మొరాయించడంతో ఆధార్ నమోదుకు వచ్చిన వారు గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. చంటి బిడ్డలతో వచ్చిన వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆధార్ నమోదుకు ఉదయం వస్తే సాయంత్రం వరకు పడిగాపులు కాయాల్సి వస్తోందని పలువురు వాపోయారు. సంబంధిత అధికారులు స్పందించి సర్వర్ సక్రమంగా పనిచేసేలా చర్యలు చేపట్టి ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు.

మూఢనమ్మకాలను వీడాలి



వస్త్ర సంచులను ప్రదర్శిస్తున్న జేవీవీ బాధ్యులు

సీతారామపురం : ప్రజలు మూఢనమ్మకాలను వీడి శాస్త్ర విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని జన విజ్ఞాన వేదిక జిల్లా బాధ్యుడు గాజులపల్లి రామిరెడ్డి అన్నారు. మండల విద్యావనరుల కేంద్రంలో సోమవారం నిర్వహించిన జేవీవీ మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్లాస్టిక్‌తో మానవాళికి ముప్పు పొంచి ఉన్నందున ప్రతి ఒక్కరూ వస్త్ర సంచులను వినియోగించాలని కోరుతూ సమావేశానికి హాజరైన ప్రతిఒక్కరికీ వస్త్ర సంచులను పంపిణీ చేశారు. అనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల గౌరవాధ్యక్షుడిగా బ్రహ్మయ్య, అధ్యక్షుడిగా శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా చలపతి, కోశాధికారిగా టీవీ మహాలక్ష్మి, ఉపాధ్యక్షులుగా నాగరాజు, జయరావు, లిల్లీ, వెంగమ్మ, కార్యదర్శులుగా వెంకటేశ్వర్లు, భాస్కర్, విజయ్, వెంకటేశ్వర్లు, సహాయ కమిటీ సభ్యులుగా ఏవీ రమణయ్య, ఎడమ తిరుపతయ్య, భోగ్యం శ్రీనివాసులు, రామిరెడ్డిని ఎన్నుకున్నారు. జేవీవీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు శ్రీనివాసులురెడ్డి, జిల్లా గౌరవాధ్యక్షుడు దస్తగిరిఅహ్మద్ పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగునకు చర్యలు



సీతారామపురం : గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు చేపట్టాలని ఆత్మకూరు డీఎల్‌పీఓ నయీమ్ పంచాయతీకార్యదర్శులను ఆదేశించారు. మండలంలోని గుండుపల్లి, సీతారామపురం గ్రామాల్లోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హరితరాయబారుల ద్వారా గ్రామాల్లోని ఇంటింటి నుంచి తడి, పొడి చెత్తను సేకరించి సంపద తయారీ కేంద్రానికి తరలించాలన్నారు. తడి చెత్త నుంచి వర్మికంపోస్టు తయారు చేసి పంచాయతీల ఆదాయాన్ని పెంపొందించాలన్నారు. ఇంటి పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆయన వెంట డిప్యూటీ ఎంపీడీఓ భార్గవిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి రామనాథరెడ్డి, తదితరులు ఉన్నారు.

డ్రైనేజీ నిర్మాణానికి చర్యలు

సాక్షి ఎఫెక్ట్..



డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రవీంద్రనాథ్

దగదర్తి : మండలంలోని ఉలవపాళ్ల పంచాయతీలో డ్రైనేజీ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రవీంద్రనాథ్ తెలిపారు. ఉలవపాళ్ల పంచాయతీల్లో డ్రైనేజీ పూర్తిగా నిర్వీర్యమవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొత్తగా మురుగుకాలువను నిర్మించి సమస్యను పరిష్కరించాలని కలెక్టర్‌తో పాటు మండలాధికారులకు పలుమార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదు. ఈ విషయమై ఈ నెల 19న 'సాక్షి'లో 'కాలువ ఇలా..మురుగు పారేదెలా' శీర్షికన కథనం ప్రచురించడంతో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రవీంద్రనాథ్ స్పందించారు. సోమవారం ఉలవపాళ్లకు వచ్చి కాలువను పరిశీలించారు. డ్రైనేజీ నిర్మాణానికి రూ.7లక్షలతో అంచనాలు సిద్ధం చేశామని తెలిపారు. ఉపాధి హామీ పథకం నిధులతో డ్రైనేజీ నిర్మాణం చేపడతామన్నారు. మండలంలో డ్రైనేజీల నిర్మాణాలకు రూ.1.56 కోట్లతో అంచనాలు సిద్ధం చేసి నిధుల మంజూరు కోసం వేచి చూస్తున్నామన్నారు. నిధులు విడుదలైన వెంటనే నిర్మాణ పనులు చేపడతామని తెలిపారు.

యూపీ యువకుడిపై దౌర్జన్యం



కుల్ఫీలు విక్రయించే యువకుడిపై దౌర్జన్యం చేస్తున్న స్థానికులు

ఆత్మకూరు: ఆత్మకూరు పట్టణంలో దౌర్జన్యాలకు పాల్పడుతున్న ఘటనలు రోజురోజుకు పెరుగుతున్నాయి. పట్టణంలోని టెంకాయతోపు ప్రాంతంలో సోమవారం బతుకుదెరువు కోసం ఉత్తరప్రదేశ్ నుంచి వచ్చి సైకిల్‌పై కుల్ఫీలు విక్రయించుకునే యువకుడిపై ముగ్గురు గంజాయి సేవించిన యువకులు దౌర్జన్యానికి పాల్పడ్డారు. అతని జేబులోని రూ.500 లాక్కున్నారు. దీంతో వారిని ఎదిరించలేక ఆ యువకుడు అక్కడి నుంచి సైకిల్ నెట్టుకుంటూ వెళ్లిపోయాడు. పోలీసులకు ఫిర్యాదు చేసినా స్టేషన్ల చుట్టూ తిరగలేక, దాడికి పాల్పడిన వారిని గుర్తించి చెబితే మరోసారి ఎలాంటి దాడికి గురికావాల్సి వస్తుందేమోనని భయంతో మౌనంగా వెళ్లిపోయాడు. ఈ ఘటనను కొందరు వీడియో తీసి వైరల్ చేశారు.

రీసర్వేపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలి



ఆత్మకూరు: డిప్యూటీ తహసీల్దార్లు, సర్వేయర్లు రీసర్వేపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని జిల్లా సర్వే ఇన్‌స్పెక్టర్లు పీ రఘురామరాజు, పీ శ్రీనివాస్ అన్నారు. ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ బీ పావని ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలోని అన్ని మండలాల రీసర్వే డిప్యూటీ తహసీల్దార్లు, సర్వేయర్లకు సోమవారం వర్క్‌షాప్ నిర్వహించారు.ఈ వర్క్‌షాప్‌లో జిల్లా సర్వే ఇన్‌స్పెక్టర్లు పాల్గొని రీసర్వేపై అవగాహన కల్పించారు. రీసర్వే డిప్యూటీ తహసీల్దార్లకు ప్రత్యేక యాప్ రూపొందించినట్లు తెలిపారు. భూముల సమస్యలపై సంబంధిత లాగిన్‌లో నమోదు చేయాలన్నారు. ప్రభుత్వ భూములు, డీకేటీ పట్టాలు నమోదు పూర్తి అవగాహనతో చేయాలన్నారు. పాత, కొత్త సర్వే రికార్డుల నిర్వహణలో భవిష్యత్‌లో ఎలాంటి సమస్యలు రాకుండా నంబర్లు నమోదు చేయాలని సూచించారు. రీసర్వేతో కలిగే సమస్యలపై రైతులు అప్పీల్ చేసుకోవడానికి యాప్‌లో ప్రత్యేకంగా లాగిన్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఏ మండలాల్లో ఏ గ్రామాల్లో రీసర్వే జరుగుతుందో వెంటనే తెలుసుకునేందుకు సైతం యాప్ దోహదపడుతుందన్నారు. మొబైల్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకుని భూముల వివరాలు, భూ స్థితి పక్కాగా నమోదు చేయాలన్నారు. ఎలాంటి సమస్యలు ఎదురైనా జిల్లా అధికారులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీటీలు, డివిజన్ డిప్యూటీ రీసర్వే ఇన్‌స్పెక్టర్ ఆమంచెర్ల శ్రీనివాసరావు, రాజ్‌నారాయణ్, తదితరులు పాల్గొన్నారు.